
ఆంధ్ర విత్తనాలపై అన్నదాత అనాసక్తి !

- భారీగా తగ్గిన పత్తి విత్తన విక్రయాలు
- తెలంగాణ, కర్ణాటక విత్తనాలపై రైతుల ఆసక్తి
- రూ.15 కోట్ల మేరా తగ్గిన విత్తన వ్యాపారం
- విత్తనాలు కంపెనీలకు వెనక్కి పంపుతున్న డీలర్లు
- ఇదే అదనుగా జోరు పెంచిన నకిలీ విత్తన వ్యాపారులు


ఇటీవల పట్టుబడిన నకిలీ విత్తనాలతో వ్యవసాయాధికారులు,


నకిలీ పత్తి విత్తనాలు

మంత్రాలయం : ఖరీఫ్‌లో రైతులు పత్తి సాగుపైనే మక్కువ చూపుతున్నారు. అయితే స్థానిక దుకాణాల్లో విత్తనాలు కొనేందుకు ఆసక్తి చూపడం లేదు. రాష్ట్రానికి చెందిన కంపెనీల విత్తనాలు సరైన దిగుబడి రావడం లేదని పక్క రాష్ట్రాల నుంచి తెచ్చుకుంటున్నారు. మరికొందరు తెలిసిన వారి వద్ద లూజు విత్తనాలు కొంటున్నారు. ఇదే అదనుగా భావించి కొందరు రాజకీయ పలుకుబడి ఉపయోగించి నకిలీ విత్తన విక్రయాలు జోరుగా సాగిస్తున్నట్లు సమాచారం.

1.38 వేల ఎకరాల్లో సాగు

మంత్రాలయం నియోజకవర్గంలో 1,92,115 ఎకరాల సాగు భూమి ఉంది. 1.20, 552 ఎకరాలు వర్షాధారం ఉంది. వర్షాధారంతో కలుపుకుని నియోజకవర్గంలో 1,38,237 ఎకరాల్లో పత్తి పంట వేస్తున్నారు. అత్యధికంగా కౌతాళం, కోసిగి, మంత్రాలయం మండలాల్లో పత్తి సాగు చేస్తుండగా అత్యల్పంగా పెద్దకడబూరులో విత్తు పడుతోంది. గతేడాది మిరప, ఉల్లి పంటలకు గిట్టుబాటు ధర లభించలేదు. దీంతో ఈసారి రైతులు ఎక్కువగా పత్తి సాగుపైనే మక్కువ చూపుతున్నారు. గురురాఘవేంద్ర ప్రాజెక్టు పరిధిలో జలాశయాల పంపుహౌస్‌ల్లో చోరీలు జరిగిన విషయం విధితమే. సదరు ఆయకట్టు భూములన్నీ ప్రస్తుతం వర్షాధారంగా మారడంతో ఆ పొలాల్లోనూ పత్తి వేసేందుకు రైతులు సమాయత్తమయ్యారు.

రూ.15 కోట్ల మేర వ్యాపారం పతనం

మునుపెన్నడూ లేని వింత పరిస్థితి ఈ ఏడాది కనిపిస్తోంది. జిల్లాలో వేలాది మంది రైతులు ఆంధ్ర పత్తి విత్తనంపై ఆసక్తి చూపడం లేదు. స్థానిక దుకాణాల్లో దొరికే విత్తనంపై రైతులు అనాసక్తి చూపుతున్నారు. ఇవి సరైన దిగుబడులు రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ కారణంగా వేలాది మంది రైతులు పక్క రాష్ట్రాల పత్తి విత్తునే కొంటున్నారు. కౌతాళం, కోసిగి, ఆదోని రైతులు కర్ణాటక రాష్ట్రంలోని దుకాణాల్లో సీడ్ కొంటున్నారు. పెద్దకడబూరు, మంత్రాలయం, నందవరం, సి.బెళగల్, ఎమ్మిగనూరు మండలాల రైతులు ఎక్కువగా తెలంగాణ నుంచి తెచ్చుకుంటున్నారు. శాంతినగర్, అయిజ, గద్వాల, రాయచూరు ప్రాంతాల్లో విత్తనాలు కొనుగోళ్లు చేస్తున్నారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో రూ.15 కోట్ల మేర విక్రయాలు తగ్గినట్లు అంచనా.

లూజ్ విత్తనాల జోరు

వానొస్తే చాలు రైతులు సీడ్ దుకాణాలతో బారులు దీరేవారు. ఈసారి ఇలాంటి సందడి ఎక్కడా కనిపంచలేదు. ఎమ్మిగనూరులోని కిరణ్ బైబ్రిడ్ సీడ్స్ దుకాణాలు విత్తన వ్యాపారంలో ఫేమస్. అలాంటి కిరణ్ హైబ్రిడ్ సీడ్స్ డీలర్లు ఈసారి 30 శాతం విత్తనాలను కంపెనీలకు తిరిగి పంపారంటే విచిత్రమే. ప్రతి సీడ్ దుకాణంలోనూ ఇదే పరిస్థితి. కొందరు రైతులు బంధువులు, నమ్మకస్తుల వద్ద అనుమల్లేని విత్తనాలు తెచ్చుకుని సాగుకు పూనుకుంటున్నారు. కేజీ రూ.వెయ్యి చొప్పున కర్ణాటక, తెలంగాణ సీడ్ పత్తి రైతుల నుంచి విత్తనాలు తెచ్చుకున్నారు. వ్యాపారాలు పడిపోవడానికి ఇది కూడా ఓ కారణమే. నకిలీ విత్తనం నాటుకోని ఊరంటూ లేదంటే ఎంతలా నకిలీ జోరు సాగిందో అర్థం చేసుకోవచ్చు. కొందరు రాజకీయ పలుకుబడితో నకిలీ విత్తన విక్రయాలు సైతం కొనసాగించినట్లు తెలుస్తోంది. దీంతో రైతుల్లో చైతన్యం తీసుకురావడంలో వ్యవసాయాధికారుల వైఫల్యం తేటతెల్లమవుతోంది.

విత్తన వ్యాపారం భారీగా పడిపోయింది



కోసిగి మండల కేంద్రంలో శ్రీ వెంకటేశ్వర ఫర్టిలైజర్ అండ్ సీడ్స్ దుకాణం పెట్టుకున్నాను. పదేళ్లుగా దుకాణం నడుపుతున్నాను. ఏటా 30 వేల పత్తి విత్తన ప్యాకెట్లు అమ్మేవాడిని. ఈసారి కేవలం 5 వేల ప్యాకెట్లు విక్రయించాను. ఈ ఏడాది ఎన్నడూ లేనంతగా విత్తన వ్యాపారం భారీగా పడిపోయింది. వాస్తవంగా ఉల్లి, మిరప గిట్టుబాటు కాకపోవడంతో ఈసారి పత్తి సాగు బాగానే పెరిగింది. సాగు విస్తీర్ణం పెరిగినా ఇక్కడ పత్తి విత్తనాలు తక్కువగా అమ్ముడుపోయాయి. ఇక్కడి రైతులు ఎక్కువగా కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి విత్తనం తెచ్చుకున్నారు. కొందరు నమ్మకస్తుల వద్ద అనుమతుల్లేని విత్తనాలు తెచ్చుకుని విత్తు వేసుకుంటున్నారు. మా వద్దకు వచ్చే రెగ్యులర్ రైతులు సైతం ఇదే మాట చెబుతున్నారు.

– సి.కృష్ణ, సీడ్స్ దుకాణం, కోసిగి

మిగిలిన స్టాక్ వెనక్కి పంపా



నాకు శ్రీవీరభద్రేశ్వర ట్రేడర్స్ దుకాణం ఉంది. ఏటా నా దుకాణంలో 3,500 ప్యాకెట్లు విక్రయించే వాడిని. ఈసారి 2000 ప్యాకెట్లు కూడా అమ్మలేదు. పత్తి విత్తన వ్యాపారం భారీగా పడిపోయింది. విత్తనం అడిగేనాథుడు లేడు. నా వద్ద మిగిలిన స్టాక్‌ను కంపెనీలకు రిటర్న్ చేశాను. గతమెన్నడూ ఇలాంటి విపత్తు చూడలేదు. ప్రతి సీడ్ డీలర్ పరిస్థితి ఇలాగే ఉంది. ఈసారి పత్తి విత్తనం విక్రయాలు పూర్తిగా తగ్గుముఖం పట్టింది. మా ప్రాంత రైతులు ఎక్కువగా కర్ణాటక నుంచి లూజ్ విత్తనాలు తెచ్చుకుని విత్తు వేసుకుంటున్నారు.

– కుమార్ గౌడ, విత్తన వ్యాపారి, దంబలదిన్నె, కౌతాళం

ఇంత తక్కువ వ్యాపారం ఎప్పుడూ చేయలేదు



నా పేరు నవీన్ రెడ్డి. నేను కౌతాళం మండలం కేంద్రంలో శివ కిరణ్ ట్రేడర్స్ దుకాణం నడుపుతున్నాను. ఈసారి ఊహించని రీతిలో పత్తి విత్తు విక్రయాలు పడిపోయాయి. ఏటా నేను 9,000 ప్యాకెట్లు విక్రయిచే వాడిని. ఈసారి కేవలం 6,000 ప్యాకెట్లు మాత్రమే అమ్మినా. నేను ఎప్పుడూ ఇంత తక్కువగా వ్యాపారం చేయలేదు. రైతులు ఎక్కువగా ఇతర ప్రాంతాల నుంచి విత్తనం తెచ్చుకుంటున్నారు. రైతుల కోరిక తగ్గట్టు కంపెనీ విత్తనాలు రావడం లేదని రైతులు చెబుతున్నారు. డిమాండ్ ఉన్న విత్తనాలు వస్తే వ్యాపారం జరిగే అవకాశం ఉండేది. మిగిలిన సీడ్‌ను కంపెనీలకు రిటర్న్ చేస్తున్నాను.

– నవీన్‌రెడ్డి, విత్తనాల దుకాణం, కౌతాళం

జీవనోపాధుల పెంపునకు కృషి చేయాలి


స్త్రీ శక్తి భవానాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ జీవనోపాధుల జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నరసమ్మ

నందవరం : పొదుపు మహిళలకు జీవనోపాధి కల్పనకు కృషి చేయాలని డీఆర్‌డీఏ జీవనోపాధుల జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నరసమ్మ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో మరమ్మతులు చేస్తున్న స్త్రీ శక్తి భవనాన్ని పరిశీలించారు. అలాగే స్త్రీ నిధి నిధులు, బ్యాంకు లీంకేజీలు, పొదుపు రుణాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ.. నూతన భవనానికి త్వరితగతిన మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకు రావాలన్నారు. అలాగే పొదుపు మహిళల బలోపేతానికి, వారి జీవనోపాధుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే మహిళలు కుట్టుమిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ కృష్ణమూర్తి, జిల్లా జీవనోపాధుల శాఖ ఏపీఎం సుధాకర్, వెలుగు ఏపీఎం రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా ఎమ్మెల్యే

ఆదోని అర్బన్: ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. జాతీయ స్థాయిలో తనను నమ్మి నియమించినందుకు పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలియజేశారు. స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు.

క్లుప్తంగా

వేడుకల పేరుతో తగవులకు పోతే ఊరుకోం


ప్రజలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి

పెద్దకడబూరు : మొహర్రం వేడుకల సాకుతో వ్యక్తగత కక్షలతో లేదా ఏ ఇతర కారణాలతో నైనా తప్పతాగి తగవులకు పోయి గొడవలు సృష్టిస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని కంబలదిన్ని, జాలవాడి, గంగులపాడు, ముచ్చగిరి, నౌలేకల్లు, పెద్దకడబూరు తదితర గ్రామాల ప్రజలతో స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా అన్నదమ్ముల వలే కలిసిమెలిసి పండుగ వేడుకలను జరుపుకోవాలన్నారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోవాలి

నందవరం : మొహర్రం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ ఎం. కేశవ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని మాచాపురం, ఇబ్రహీంపురం గ్రామాల్లో మొహర్రం వేడుకలపై గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. అల్లరిమూకలు గ్రామంలో గొడవలు సృష్టించేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్షయ వ్యాధిని రూపుమాపుదాం

ఆదోని టౌన్: క్షయ వ్యాధిని రూపుమాపుదామని డాక్టర్ అనిల్‌సాగర్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని అర్బన్ సెంటర్ షరాఫ్ బజారులోని సంతపేట ఏరియాలో కౌన్సిలర్ బాలాజీ ఆధ్వర్యంలో క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం తదితర లక్షణాలు ఉంటే ప్రభుత్వ ఆసుపత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బాబురాజు, సీతారాముడు, చంద్రశేఖర్, సుబ్బమ్మబాయి, ఏఎన్‌ఎంసీ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆషాఢ మాస ఉత్సవాలు ప్రారంభం


రేణుక ఎల్లమ్మవ్వకు మంగళహారతి ఇస్తున్న పూజారి అవ్వ

ఆదోని అర్బన్: పట్టణశివారులోని ఎల్లమ్మ కొండల్లో వెలిసిన శ్రీ రేణుకా ఎల్లమ్మవ్వకు ఆషాఢ మాసం ఉత్సవాలు మంగళవారం ప్రత్యేక పూజలతో ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో వేకువజామున అమ్మవారికి పంచామృతాభిషేకం, పూల అలంకరణ, మహామంగళ హారతితో ప్రత్యేక పూజలు చేశారు. కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ, ఆదోని నియోజకవర్గం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని పిండి వంటలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పరామర్శ


హనుమంతు నాయక్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

మంత్రాలయం రూరల్ : మండల పరిధిలోని పరమాన్‌దొడ్డి తండా గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సుగాలి హనుమంతు నాయక్ కిడ్నీలో రాళ్లు ఉండడంతో ఇటీవల చికిత్స చేయించుకున్నారు. మంగళవారం విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి హనుమంతు నాయక్‌ను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ డాక్టర్ల విభాగపు అధ్యక్షుడు ధశరథరెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వై. ప్రదీప్‌కుమార్ రెడ్డి

మంత్రాలయం రూరల్ : మండల పరిధిలోని సూగూరు గ్రామంలో మద్యం మత్తులో భార్య బోయ లక్ష్మీదేవిని హతమార్చిన భర్త హనుమంతును పోలీసులు అరెస్టు చేసిన విషయం విధితమే. మంగళవారం వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్‌కుమార్‌రెడ్డి గ్రామానికి చెరుకుని మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి విశ్వనాథ్‌రెడ్డి, నాయకులు లక్ష్మయ్య, నాగిరెడ్డి, వీరనాగడు, దాసు, రామకృష్ణ పాల్గొన్నారు.

సోషల్ మీడియాను మితంగా వాడుకోవాలి


విద్యార్థులకు సూచిస్తున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

పెద్దకడబూరు : అమ్మాయిలు సోషల్ మీడియాను మితంగా ఉపయోగించుకోవాలని డీఎస్పీ ఉపేంద్రబాబు సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో ఆ పాఠశాల ప్రిన్సిపాల్ రుక్సానా పర్వీన్ ఆధ్వర్యంలో విద్యార్థినులతో సైబర్ నేరాలు, సోషల్ మీడియాపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు, సమాచారం లాంటి విషయాలను పంపరాదన్నారు. అదేవిధంగా తెలియని వారితో చాటింగ్ చేయడం, ఫోన్ లేదా వీడియోకాల్ చేయడం వంటివి చేయడం ద్వారా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి దాపరిస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి, ఎమ్మిగనూరు శక్తి టీమ్ ఏఎస్‌ఐ నటరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

మంత్రాలయం రూరల్ : మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థినీ, విద్యార్థులకు మాధవరం ఎస్‌ఐ వై. విజయ్‌కుమార్ ఈవ్‌టీజింగ్ ర్యాగింగ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ అశోక్‌నాయక్, అధ్యాపకులు మునీర్, నళిని పాల్గొన్నారు.

ఆదోని రూరల్: విద్యార్థులు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దని పెద్దతుంబళం ఎస్‌ఐ మహేష్‌కుమార్ సూచించారు. మంగళవారం పెద్దతుంబళం గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్, సైబర్ నేరాలు, ట్రాఫిక్ అవగాహన సదస్సు నిర్వహించారు.

ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం


వైద్యులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఆదోని అర్బన్: లయన్స్ క్లబ్ ఆదోని వారి ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజానికి సేవలందిస్తున్న డాక్టర్లను లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్లు డాక్టర్ గోపీనాథ్, ప్రసాదరావు, క్లబ్ అధ్యక్షులు ధర్మారెడ్డి, కార్యదర్శి శ్రీనాథ్ గుప్తా తదితరులు సన్మానించారు. లయన్స్ క్లబ్ కోశాధికారి వనపరాజు, విశిష్ట సభ్యులు నీలమోహన్, గోవిందరాజమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు కాపాడే డాక్టర్లను గౌరవించాలి

ఎమ్మిగనూరురూరల్: మనిషి ప్రాణాలు కాపాడే డాక్టర్లను ప్రతి ఒక్కరూ గౌరవించాలని భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ మాచాని కవిత అన్నారు. మంగళవారం స్థానిక భాష్యం ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో డాక్టర్స్ డేను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విద్యార్థులతో కలసి ప్రభుత్వాసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ సుధా, డాక్టర్లు మల్లికార్జున, ఫాతిమాతో పాటు ఇతర డాక్టర్లకు, అలాగే ప్రైవేట్ హస్పిటల్స్‌కు వెళ్లి డాక్టర్లకు మొక్కలు అందచేసి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో చాంప్స్ ఇన్‌చార్జ్ అనురాధ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి


బస్సు రికార్డులను పరిశీలిస్తున్న ఎంవీఐ సిసిరాదీప్తి, ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు

ఆదోని అర్బన్: పాఠశాలల బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరిగా ఉండాలని డీఎస్పీ హేమలత, ఎంవీఐ సిసిరాదీప్తి అన్నారు. మంగళవారం ఆదోని పట్టణంలోని భాష్యం ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూట్ బస్సులను తనిఖీ చేశారు. బస్సులకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసి, బస్సు డ్రైవర్లకు, స్కూలు యాజమాన్యానికి సూచనలు చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ బస్సులకు సంబంధించి అన్ని రికార్డులు తప్పనిసరిగా అప్‌డేట్‌లో ఉండాలన్నారు. అలాగే డ్రైవర్లు యూనిఫాం కలిగి ఉండి, పిల్లల పట్ల మర్యాదగా ఉండాలన్నారు. డోర్ స్టెప్స్ వద్ద పిల్లలు నిలబడకుండా, కిటికీలోంచి తలలు బయటికి పెట్టకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. తనిఖీలో ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

సౌకర్యాలు కల్పించడమే ధ్యేయం

కౌతాళం: గ్రామంలో అన్ని సౌకర్యాలు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని కౌతాళం సర్పంచ్ పాల్ దినకర్ అన్నారు. సోమవారం పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. కార్యదర్శి ప్రకాశం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో సర్పంచ్ మాట్లాడుతూ గత సంవత్సర కాలంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్, గ్రామ పంచాయతీ నిధుల నుంచి చేపడుతున్న పనుల గురించి వివరించారు. వర్షకాలం ప్రారంభం కావడంతో గ్రామంలో పారిశుద్ధ్య సమస్య లేకుండా చూస్తున్నామన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్న పంచాయతీ కార్యాలయంలో కానీ, తనకు కానీ తెలపాలని సూచించారు.

విధుల్లో చేరకపోతే తొలగిస్తాం


మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె విరమించి విధుల్లో చేరకపోతే విధుల నుంచి తొలగించేందుకు మున్సిపల్ శాఖ ఆదేశాలిచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం సమ్మె చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులను మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పిలిపించి సీడీఎంఏ నుంచి వచ్చిన ఆదేశాలను వివరించారు. కార్మికుల సమస్యలపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులు చర్చలు జరుపుతున్నారని, అందువలన విధుల్లో చేరాలని సూచించారు. లేనిచో నోటీసులిచ్చి విధుల నుంచి తొలగించాల్సి వస్తుందని హెచ్చరించారు. అయితే మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకత్వం నిర్ణయం మేరకు నడుచుకుంటామని సమాధానమిచ్చి.. దీక్ష శిబిరంలో కూర్చున్నారు.

- ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఇంటికీ కుళాయి
- ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మా ప్రభుత్వం లేకున్నా మాట తప్పం


వాల్వ్ తిప్పి కుళాయిలకు నీరు వదులుతున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

పెద్దకడబూరు : గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం ప్రతి ఇంటికీ కుళాయి వేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చామని, ప్రభుత్వం మారినా ఇచ్చిన మాటను మాత్రం మరువలేదని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చెప్పారు. మండల పరిధిలోని నాగులాపురం గ్రామంలో మంగళవారం ఎంపీడీఓ ప్రభావతి ఆధ్వర్యంలో ఇంటింటికీ కుళాయిలను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం నేడు గ్రామంలోని ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దాదాపు రూ. 10లక్షలు ఎంపీపీ నిధులు, పంచాయతీ నిధులతో గ్రామంలో సుమారు 200 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇచ్చినట్లు తెలిపారు. జలజీవన్ మిషన్ నిధులు రూ. 26.5లక్షలతో ఏర్పాటు చేసిన ఓహెచ్‌ఆర్ ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు. నియోజకవర్గంలో ఎక్కడా సమస్యలు రానివ్వకుండా అధికారంతో సంబంధం లేకుండా అభివృద్ధికి పూనుకుంటానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు రవిచంద్రరెడ్డి, రైతువిభాగం నియోజకవర్గ అధ్యక్షుడు యల్లప్ప, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడు ముక్కరన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికుమార్, పార్టీ నాయకులు అర్లప్ప, విశ్వనాథ్, కృష్ణారెడ్డి, శివరాముడు, యోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా కమిటీలో స్థానం

ఆదోని రూరల్: కర్నూలు జిల్లా పంచాయతీరాజ్ విభాగ కమిటీని వైఎస్సార్‌సీపీ కేంద్ర పార్టీ కార్యాలయం సోమవారం నియమించింది. ఇందులో జిల్లా జనరల్ సెక్రటరీగా కపటి గ్రామానికి చెందిన నాయక్‌నారాయణ, సెక్రటరీగా అదే గ్రామానికి చెందిన వడ్డే చిన్నకృష్ణలను ఎంపిక చేశారు. ఈ మేరకు జనరల్ సెక్రటరీ నాయక్ నారాయణను స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కపటి గ్రామ నాయకులు శాలువాలు, పూలమాలలు వేసి సన్మానించారు. నాయకులు ఈడిగ చంద్రశేఖర్‌గౌడ్, హరిశ్చంద్రగౌడ్, వీరాంజనేయులుగౌడ్, భాస్కర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ఆదోని రూరల్: కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటమ్మ, సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు తిప్పన్న, పి.ఎస్.గోపాల్, ప్రాజెక్ట్ నాయకురాలు పద్మ, వరలక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని రెవెన్యూభవన్‌లో అంగన్‌వాడీ అర్బన్ కార్యకర్తల మహాసభను సరోజ అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యాలను, ప్రమాద బీమా సౌకర్యాలను కల్పించాలన్నారు. అనంతరం అర్బన ప్రాజెక్టు కమిటీ అధ్యక్షురాలిగా రేణుక, ప్రధాన కార్యదర్శిగా సరోజ, కమిటీ సభ్యులుగా పద్మ, పుష్ప, లక్ష్మీదేవి, లలిత, రాజేశ్వరి, మంజుల, భానులను ఎన్నుకున్నారు.

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక కార్యాలయంలో సీఐటీయూ నాయకులు గోవిందు, రాముడుల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యునియన్ జిల్లా కార్యదర్శి వెంకటమ్మ, ప్రాజెక్ట్ కార్యదర్శి గోవర్ధనమ్మలు పాల్గొన్నారు. ఈనెల 9వ తేదీన అంగన్‌వాడీ సిబ్బంది దేశవ్యాప్తంగా నిర్వహించే సమ్మెలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

39 మంది మందుబాబులపై కేసు నమోదు

ఆదోని అర్బన్: పట్టణశివారులోని ఎల్లమ్మకొండలో నిబంధనలను ఉల్లంఘించిన 39 మందిపై కేసులు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ తెలిపారు. . అందులో బహిరంగంగా మద్యం సేవిస్తున్న 28 మంది, డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తున్న 11 మంది ఉన్నారన్నారు. వీరిని బుధవారం కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

పత్తిలో తెగుళ్లను మొదటి దశలోనే అరికట్టాలి


చెట్నహళ్లిలో మాట్లాడుతున్న ఏడీఏ మహమ్మద్ ఖాద్రి, అధికారులు

మంత్రాలయం రూరల్ : పత్తిపంటలో సోకే తెగుళ్ల, చీడపీడలను మొదటి దశలోనే అరికట్టాలని ఏరువాక శాస్త్రవేత డాక్టర్ సుజాత, ఏడీఏ మహమ్మద్ ఖాద్రి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని చెట్నహళ్లి గ్రామంలో పత్తి పంటను పరిశీలించారు. అనంతరం ఏఓ జీరా గణేష్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. పత్తి సాగులో అధిక మోతాదులో ఎరువులు వేయడంతో తెగుళ్ల సోకే అవకాశం ఉందని, భూ సారం తగ్గుతుందని వివరించారు. అలాగే పత్తిలో పంచ పంట, అంతర్ పంటలు వేసుకోవడం ద్వారా చీడపీడలు, తెగుళ్ల నివారణ సాధ్యమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ తిరుమలరెడ్డి, వీహెచ్‌ఏ ప్రవీణ పాల్గొన్నారు.

ఆదోని రూరల్: మండలంలోని మండిగిరి రైతుసేవా కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో రైతులు సాగుచేసిన పత్తి, వేరుశనగ పంటలను ఏఓ సుధాకర్ పరిశీలించారు. రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గింది సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు.

ఏజెంట్ల మాటలు నమ్మి మోసపోవద్దు

ఎమ్మిగనూరురూరల్: రైతులు విత్తనాలు కొనుగోలులో కంపెనీల ఏజెంట్ల మాటలు నమ్మి మోసపోవద్దని, వ్యవసాయాధికారులను సంప్రదించి నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలని ఏఓ శివశంకర్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని బనవాసి, మల్కాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

వర్మీ కంపోస్టును రైతులకు విక్రయించాలి


నందవరంలో వర్మీంపోస్టు ఎరువును పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ తిమ్మక్క

నందవరం : చెత్త సంపద కేంద్రాలలో తయారు చేసే వర్మీ కంపోస్టు ఎరువును రైతులకు విక్రయించి పంచాయతీలకు ఆదాయం పెంచాలని డీఎల్‌పీఓ తిమ్మక్క పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రం నందవరంలో గ్రామంలో హోటల్, షాపులు, దుకాణాలలో చెత్త నిర్వహణ, సేకరణపై యజమానులకు అవగాహన కల్పించారు. అనంతరం చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ..పంచాయతీకి ఆదాయ వనరులను పెంచుకోవాలన్నారు. గ్రీన్ అంబాసిడర్లు ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించాలన్నారు. గ్రామాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ కృష్ణమూర్తి, డిప్యూటీ ఎంపీడీఓ సందీప్, పంచాయతీ కార్యదర్శులు విజయలక్ష్మి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి


మాట్లాడుతున్న విరూపాక్షి రెడ్డి

నందవరం : రైతుల సాగు చేసిన పంటలకు కూటమి ప్రభుత్వమే పంటల బీమా ప్రీమియం చెల్లించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి విరూపాక్షిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని ముగతి గ్రామంలోని తన స్వగృహంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులపై పంట బీమా ప్రీమియం భారం మోపే కూటమి నిర్ణయాన్ని తీవ్రంగా విమర్శించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో వ్యవసాయ రంగాన్ని, రైతులను ఆర్థిక బలోపేతం చేసిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. రైతులపై ఒక రూపాయి భారం లేకుండా ఉచితంగా పంట బీమా ద్వారా 54 లక్షల మందికి నేరుగా వారి ఖాతాల్లో రూ.7,800 కోట్లు బీమా నగదు జమ చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం అధికారం చేపట్టిన కూటమి సర్కార్ రైతులను విస్మరించి పంటల బీమాకు మంగళం పాడిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు రాఘవరెడ్డి, నాయకులు రంగారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, లింగారెడ్డి, బీముడు, పింజారి రాజాక్ తదితరులు పాల్గొన్నారు.